# ఇది ఈ తరం ప్రేమ

రచన:
"శేఖరమంత్రి"

ఉదయం లేచిన దగ్గర్నుంచి ఏమీ తెలియని ఆలోచనతో గడిపేస్తుంది రమ. ఒక్క క్షణం భయం. మరొక్క క్షణం విస్మయం. ఇంకొక్క క్షణం ఏదో తెలియని అసహాయత. అతి సుందరమైన ఆమె మోములో ఏదో తెలియని ఆందోళన. దానికి కారణం నిన్న పార్కులో శేఖర్ చెప్పిన విషయం,

"రమా! మన ప్రేమను గూర్చి మీ నాన్నకు చెప్పలేను. చెప్పినా కులం తక్కువైన నాకిచ్చిపెళ్ళి చేయడు. సరికదా తన ఛాందస సాంప్రదాయాలనే ఇటుకలతో మన ప్రేమని సమాధి కడతాడు. అయినా శారీరకంగా, మానసికంగా, మనమెప్పుడో భార్యా భర్తలమైపోయాము. 'పెళ్ళి' అనే నిర్బంధం వల్ల ప్రేమికుల్లా మిగిలాం. ఎన్నాళ్ళిలా పార్కుల్లో కలుసుకొంటాము! అందుకే ధైర్యం చేసి నేనీ నిర్ణయం తీసుకొన్నాను. అప్ కోర్సు నాకు బాధగానే వుంటుంది. మన సంగతి తెలిసిన మా అన్నయ్య కూడా చెప్పాడు, ముందు వెళ్ళి రిజిష్టర్ మేరేజ్ చేసుకొచ్చేయమన్నాడు. మొదట గోల పెట్టినా వేరే దారి లేక మీ నాన్నే ఒప్పుకొంటాడు. సో.... రేపు మనం బయల్దేరుతున్నాం. నువ్వు స్టేషన్‌కొచ్చేయ్!"

నిజమే.... శేఖర్ చెప్పిన దాంట్లో కూడా నిజం లేకపోలేదు. మొన్న ఒంట్లో నలతగా వుందని డాక్టరు దగ్గర కెళ్ళినపుడు తెలిసింది. తన కడుపులో శేఖర్ ప్రతిరూపానికి ప్రతిష్టాపన జరిగి రెండు నెలలు అయిందని. అందుకే ఇంత తొందర పడడం. శేఖర్ చాలా మంచివాడు. ఒక్క క్షణం అతను గుర్తుకు వచ్చి మురిసి పోయింది. తనకు శేఖర్ లాంటి యోగ్యుడు, మంచి ప్రేమికుడు తన భర్తవుతున్నందుకు. మరుక్షణం మరొకప్రక్క బాధతో తండ్రి గూర్చి, తండ్రి పరువు ప్రతిష్ఠల గూర్చి. కాని ఏ విధంగా చూసినా ఆమె పరువు ప్రతిష్టలు మంట గలపక మానవు. రేపు తన కడుపులో బిడ్డకు తండ్రెవరన్న ప్రశ్న ఉదయించకుండా వుండాలంటే తాను ధైర్యం చేయక తప్పదు. ఈ నిశ్చయానికి వచ్చిన తరువాత ఆమె తేలిక పడిన మనసుతో సూట్‌కేసులో బట్టలు సర్దసాగింది.

అరగంట పైనే అయ్యింది రమ ఆ బెంచి మీద కూర్చుని. దూరంగా పట్టాల మీద కొంతమంది జనం.... 'ఏమయిందో?' అని అటు ఒకసారి చూసి, ఇంకొకసారి చేతినున్న వాచివైపు చూసుకొంది. శేఖర్ జాడ లేదు. ఒక్కసారిగా ఆమె మదిలో చిన్న అనుమానం మెదలింది. శేఖర్ తనకు మోసం చేయడు కదా! 'ఛా....తన శేఖర్ అలాంటివాడు కాదు - తన కోసం, తన లానే, తన తల్లిదండ్రులను వదలి వచ్చేస్తున్నాడు. దూరంగా ఏదో ట్రైను వస్తున్నట్లు కూత వినబడింది. ప్లాట్‌ఫారం చివరికి వెళ్ళి చూసింది. శేఖర్ జాడ లేదు. దూరంగా స్టేషన్‌మాష్టరు రూమ్ ప్రక్క నుండి వస్తున్నది....వస్తున్నది! దగ్గరకు వచ్చిన తరువాత తెలిసింది - అతను శేఖర్ ఫ్రెండ్ సురేష్'

* * *

ఎప్పుడూ హుషారుగా ఉండే సురేష్ ఈరోజు ఎందుకో దిగులుగా ఏదో పోగొట్టుకున్న వాడిలా వున్నాడు. 'సురేష్ గారూ!' అంటూ ఏదో అడగబోతున్న రమను వారించి తడబడే మాటలతో మీ ...మా....మీకు ఈ పుత్తరం శేఖర్ యిమ్మన్నాడు." అంటూ ఒక లెటర్ యిచ్చారు. ఎప్పుడు శేఖర్ నుండి లెటరు తెచ్చినా ఏదో జోక్ కట్ చేస్తూ యిచ్చే సురేష్ - ఎందుకూ, ఏమీ మాట్లాడకుండా యిస్తున్నాడు. 'అసలు శేఖర్ రాకుండా లెటర్ ఎందుకు పంపినట్లు?' అన్న అనుమానంతో, అందుకొన్న లెటర్ చదివింది. అందులో—

డియర్ రమా!

ఎప్పుడూ మనకు లెటర్సు అందించే సురేష్ ఈ లెటర్ నాకివ్వడం అది వాడి దురదృష్టం.... మన జీవితాలు పూలబాటలుగా సాగాలని ఎన్నో కలలు కన్నాం. ఆ కలలు కలలనీ, అవి ఫలించవనీ తెలుసుకొని నిస్తేజున్నయ్యాను. దీనికంతటికీ కారణం మా అన్నయ్య. మా అన్నయ్య నాకు నమ్మకద్రోహం చేసాడు. మన ప్రేమ విషయం మా నాన్నతో చెప్పాడు. వాళ్ళిద్దరూ కలిసి తాము

చూసిన కట్నంతో వచ్చేపిల్లను కట్టుకొమ్మన్నారు. ఎదిరించిన నన్ను గదిలో నిర్బంధించారు. నా సర్టిఫికెట్లు తీసుకొని పారిపోదామని వాటి కోసం దొంగచాటుగా గదిలోంచి తప్పించుకొని నా గది లోనికి వెళ్ళగా, ఎదురుగా కనబడిన దృశ్యం— మా వదిన ప్రక్కింటి సుబ్బారావుతో....నన్ను చూసిన మా వదిన నేనేదో చేయబోతానని అరచి, కేకలు పెట్టింది. వచ్చిన నాన్న, అన్నయ్యల అరు పులకి చుట్టుప్రక్కల వాళ్ళలో చులకన అయ్యాను. ఒక్కసారి మచ్చంటూ పడ్డాక అది చెరిగిపోదని, దానినుంచి దూరంగా పారిపోదామని ప్రయత్నించినా అది మన వెంట నీడలా రాక తప్పదు. మంచి - చెడులలో దేనిని గుర్తించి అసహ్యించుకోవాలో తెలియని ఈ లోకం అంటే అసహ్యం వేసి ఈ లోకం నుంచే వెళ్ళిపోతున్నాను. నీకు అన్యాయం జరుగుతుందని తెలిసినా, దుర్మార్గుడిగా ముద్రపడి నీ భర్తగా వుండలేను రమా... ఉండలేను. మళ్ళీ జన్మంటూ వుంటే నీ శేఖర్‌గా పుడతాను.

ఇట్లు,
ఈ జన్మలో నీ వాణ్ణి కాకపోయిన
"నీ శేఖర్."

అంటే....అంటే....ఇందులో రాసింది నూతిలోంచి వచ్చినట్లుందామెకు కంఠం.

అవును. సాయంత్రం లెటరిచ్చి జోరుగా ఎక్కడికో వెళ్ళిపోయాడు. అంత ఆవేశంతో వాడు చేసిన పని ఇప్పుడు తెలిసింది ఆ పట్టాల మీద. తన జీవితానికి పడ్డ మచ్చ తుడిచి వేసుకొన్నాడు! ఇంక మన శేఖర్ మనకు లేడు. ఇక రాడు. సురేష్ కంఠం గద్గదమై పోయింది.

ఆ మాటలు విన్న రమకు తలలో నరాలు చిట్లిపోతున్న ఫీలింగ్ భూమి, ఆకాశం కలిసిపోతూ. ఆ మధ్యలో నలిగి పోవటం అంటే ఏమిటో ఆమెకి తెలిసింది. అంటే.... అంటే....ఆ పట్టాల మీదున్న వ్యక్తి తన శేఖర్....ఇక ఆగలేక రైలుపట్టాల కేసి పరిగెత్తింది. అంబులెన్సు కెక్కిస్తున్న అతని రూపం ఆమె కన్నీటితో నిండిన కన్నులకు మసకగా కనిపించింది. ఇక చూడలేక వెను తిరిగింది రమ.

మర్నాడు పేపరులో ఒక మూల చిన్న అక్షరాలతో ఒక వార్త. అది రైల్వేస్టేషన్ దగ్గరలోనున్న బావిలో 'రమ' అనే యువతి దూకి మరణించింది. ఆమె మరణం 'ఆత్మహత్య' అని పోలీసులు తమ దర్యాప్తులో నిర్ణ యించిరి.

* * *

ఇది జరిగిన వారం రోజులకు ఫణిభూషరావు గారిల్లు పెళ్ళికళతో ఉట్టిపడుతూ, బిల్డింగును కప్పే భారీ లైటింగుతో, పెళ్ళికి వచ్చిన చుట్టాల వాహనాలతో, స్టీరియో లోంచి ఖంగుమంటున్న డిస్కో సాంగ్స్‌తో, వీధి హోరెత్తి పోయింది. తరుచూ ఫణిభూషణరావుగారి ఆఖరి కొడుకు శేఖర్ పెళ్ళి అవడంతో చాలా ఘనంగా పెళ్ళి ఏర్పాట్లు చేసారు.

పెళ్ళికొడుకు రూపంలో పెళ్ళికొడుకుతో సహా మిత్ర బృందమంతా మందుసేవలో మునిగి వున్నారు. పెళ్ళి కొడుకు శేఖర్ తన ప్రియస్నేహితుడు సురేష్‌కి ఛీర్స్ చెబుతూ "ఒరేయ్! మన కట్నానికి మంచి రేటు పల్గానే ఓ మంచి ప్లానువేసి ఆ రమ అడ్డు తప్పించేసావు. నీ నాటకాల అనుభవం భలే పని చేసింది. ఐయామ్ ప్రౌడాఫ్ యూ...." అంటూ గ్లాసు అందుకున్నాడు. తలకి నిషా బాగా ఎక్కిన సురేష్, "ఒరేయ్....మరీ పొగిడేకురా. ఆ రోజు వాడెవడో ట్రైనుక్రింద చచ్చిపోబట్టిగాని, లేకపోతే మన ప్లాను సక్సెస్ అయ్యేది కాదు!" అంటూ అతనికి టూ ఛీర్స్ కొట్టి గ్లాసు తీసుకొన్నాడు.

ఆ ఛీర్స్ కొట్టిన ధ్వనికి ప్రతిధ్వనిగా ఆ మేడ పై భాగంలో వియ్యంకులైన ఫణిభూషణరావు, భుజంగరావులు ఖాళీ అయిన గ్లాసులు క్రిందకు దించారు. తమ కులాలుగా ఏదో సాధించామన్న ఆనందం వారి నిషా కళ్ళలో కని పిస్తుంది. లక్ష రూపాయల కట్నంగా వస్తుందన్న ఆశ ఫణిభూషణరావు కళ్ళలోనూ, కట్నం పోయినా, వాడెవడి తోనో తిరిగి 3వ నెల అబార్షన్ చేయించుకొన్న తన కూతురికి ఇంత వేగంగా పెళ్ళి అయిపోతుందన్న తృప్తి పెళ్ళికూతురి తండ్రి భుజంగరావు కళ్ళలోనూ కని పిస్తుంది.